

తెరపైకి టూరిజం కారిడార్





చారిత్రాత్మక కట్టడాలను పరిశీలిస్తున్న టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి (ఫైల్)

- బాసర నుంచి కవ్వాల్ వరకు రూట్‌మ్యాప్
- జిల్లాలోని చారిత్రక ప్రదేశాలకు పూర్వ వైభవం
- డ్యామ్‌లు, జలపాతాలకు లింకేజీ
- టూరిజం చైర్మన్ పర్యటనతో మారనున్న పర్యాటక రంగం

నిర్మల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో టూరిజం కారిడార్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. గతంలోనే ఈ కారిడార్ కోసం ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఈ దిశగా ఆశించిన రీతిలో చర్యలు చేపట్టలేదు. పలుసార్లు పర్యాటక శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు జిల్లాలో పర్యటించి టూరిజం కారిడార్ ఏర్పాటుపై కసరత్తు కూడా జరిపారు. అయితే అప్పటి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను కాగితాలకే పరిమితం చేసి కార్యాచరణకు శ్రీకారం చుట్టలేదు. అలాగే నయా పైసాను కూడా మంజూరు చేయకపోవడంతో ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టూరిజం రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఆదిశగా చర్యలు సైతం చేపట్టింది. అలాగే జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కూడా ఇప్పటికే పర్యాటక రంగం అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామని హామీనివ్వడమే కాకుండా ఇక్కడి చారిత్రత్మక ప్రదేశాలను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి జిల్లాలో పర్యటించి పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీనివ్వడమే కాకుండా ప్రత్యేక కారిడార్ ఏర్పాటుపై దృష్టి సారించబోనున్నట్లు వెల్లడించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. కార్పొరేషన్ చైర్మన్ ప్రకటనతో గతంలో టూరిజం కారిడార్ కోసం రూపొందించిన ప్రతిపాదనలకు మోక్షం లభించబోతోందని చెబుతున్నారు. జిల్లాలోని అనేక చారిత్రక ప్రదేశాలను ప్రకృతి సంపద ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లయితే జిల్లాకు పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ అంశాన్ని ప్రాతిపాదికన చేసుకొని టూరిజం కారిడార్ కార్యాచరణకు రూపకల్పన చేయబోతున్నారు. ఈ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం పీటటీ పద్దతిలోనైనా లేదా ఇతర పద్దతుల్లోనైనా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి వాటిని అవసరమైతే ప్రైవేటు వ్యక్తులకు సైతం అప్పగించాలని యోచిస్తోంది.

కారిడార్ దిశగా కార్యాచరణ

కాగా బాసర నుంచి కవ్వాల్ టైగర్ జోన్ వరకు స్పెషల్ టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. బాసర వద్ద రైల్వే స్టేషన్ సౌకర్యం ఉన్న కారణంగా అక్కడి నుంచే ఈ కారిడార్‌ను మొదలుపెట్టాలని యోచిస్తున్నారు. బాసరలో గోదావరి తరువాత సరస్వతీమాత ఆలయాన్ని సందర్శించుకొని కదలి పాపహరేశ్వర స్వామి ఆలయాన్ని అలాగే కాల్వ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని దర్శించుకునే విధంగా ఈ కారిడార్ కార్యాచరణ మొదలుకానుంది. నిర్మల్‌లోని చారిత్రక కోటలు బత్తీస్‌ఘడ్, శ్యాంఘడ్‌తో పాటు నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమ సందర్శనను చేపట్టనున్నారు. అక్కడి నుంచి ఎస్సారెస్పీ ఆ తరువాత కడెం ప్రాజెక్టు సందర్శన అనంతరం కవ్వాల్ టైగర్ జోన్‌ను తిలకించే విధంగా యాత్రికులకు ఏర్పాట్లు చేయనున్నారు. కడెం వద్ద రూపుదిద్దుకుంటున్న హరిత రిసార్ట్ యాత్రికులకు భోజన వసతిసౌకర్యం కల్పించనుంది. వీటితో పాటు బోథ్ నియోజకవర్గంలోని పొచ్చెర, కుంటాల జలపాతాలను సైతం ఈ కారిడార్ పరిధిలోకే తీసుకురావాలని యోచిస్తున్నారు. ఇదే జరిగితే రెండు రోజుల పాటు పర్యాటకులను ఇక్కడే బస చేసే విధంగా ఏర్పాట్లు చేపట్టనున్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగు

టూరిజం రంగం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని దీంతో స్కిల్ ఉన్న వారందరికీ తప్పనిసరిగా పని దొరుకుతుందని చెబుతున్నారు. అలాగే అనుబంధ రంగాలకు సైతం ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా సందర్శకుల రవాణా కోసం వాహనాలకు, వసతికోసం గెస్ట్‌హౌజ్‌లు, లాడ్జీలకు గిరాకీ పెరుగుతుంది. అలాగే హోటళ్లకు సైతం సందర్శకుల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. అలాగే ఇక్కడి పర్యాటక ప్రదేశాలు ఇతర ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందంటున్నారు.

టూరిజం చైర్మన్ హామీపై ఆశలు

కాగా జిల్లాలో టూరిజం రంగాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామంటూ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ చేసిన ప్రకటనపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ అర్జుమన్, కరీంనగర్ గ్రంథాయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్‌తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్‌లు జిల్లాలోని టూరిజం ప్రదేశాలతో పాటు వాటి అభివృద్ధిపై టూరిజం చైర్మన్ దృష్టికి తీసుకువెళ్ళడమే కాకుండా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. వీరి సూచనల మేరకే చైర్మన్ పటేల్ రమేష్ స్వయంగా జిల్లా కేంద్రానికి వచ్చి ఇక్కడి కోటలు, బురుజులను సందర్శించారు. చారిత్రక, కోటలు, బురుజులతో పాటు చారిత్రక ప్రదేశాలను చూసి ఆయన తన్మయత్వానికి లోనయ్యారు. టూరిజం కారిడార్ ఏర్పాటు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్ళి నిదులు మంజూరు చేయిస్తానంటూ కూడా ఆయన హామీనివ్వడంతో ఇక జిల్లాకు మహార్దశ పట్టనుందని అంటున్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలి

• అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.. హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఎంపీడీవోలు, బ్యాంకర్లతో ఆయన రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మండలస్థాయిలో దరఖాస్తులను ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పరిశీలించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, వికలాంగులను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే ముందు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిపించాలన్నారు. ఒకే గ్రామంలో ఎక్కువ మంది ఒకే రకమైన యూనిట్లు పెట్టే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. దీనివల్ల వ్యాపారంలో పోటీ పెరిగి నష్టాలు వస్తాయన్నారు. సరైన లబ్ధిదారుల ఎంపికకు పారదర్శకత పాటించాలన్నారు. ఎంపికైన యూనిట్లకు సంబంధించిన గ్రౌండింగ్ పూర్తయిందో లేదో క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, ఏవైనా సందేహాలుంటే వెంటనే పై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, డీడీఎం నాబార్డ్ వీరభద్రుడు, సంక్షేమ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. దరఖాస్తు దారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను అదనపు కలెక్టర్ ఫోన్ ద్వారా స్వీకరించారు. దరఖాస్తు వివరాలను వాట్సాప్ ద్వారా స్వీకరించి ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధించి రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా అందించారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి 11 గంటల మధ్యలో, దూర ప్రాంత ప్రజలు 9100577132ను సంప్రదించడం ద్వారా తమ సమస్యలను తెలుపవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జొన్నల టోకెన్ల కోసం రైతుల బారులు

కుబీర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో మండల రైతులు పండించిన జొన్నలను విక్రయించేందుకు తేదిల వారిగా టోకెన్లను సోమవారం ఏఎంసీ కార్యాలయంలో అందించారు. మద్యాహ్నం వరకు సజావుగా సాగిన సాయంత్రానికి రైతుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయి బారులలు తీరారు. ఆధార్, పట్టాపాస్‌బుక్కు లజిరాక్సు పత్రాలను రైతుల నుండి తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు ఉన్న రైతులకు టోనెక్‌లను అందించారు. ఎకరానికి 14క్వింటాల్లు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ఇబ్బంది పడవద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

..ఎకరానికి 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలి

కుంటాల, ఏప్రిల్, 21 : (ఆంధ్రజ్యోతి) : ఎకరానికి 20 క్వింటాళ్లు జొన్నలను కొనుగోలు చేయాలని సోమవారం కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన రైతులు నిరసన కార్యక్రమంలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోరిక మేరకు రబీ సీజన్‌లో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కానీ ఎకరానికి 14 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడంతో తమకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని మిగితావి ఎక్కడ విక్రయించుకోవాలని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఎకరానికి 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలన్నారు.

సార్వత్రిక పరీక్షలపై డీఈవో సెట్ కాన్ఫరెన్స్



నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ప్రారంభమైన పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలపై డీఈవో రామారావు సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూపరింటెండెంట్లు, డీవోలకు సూచనలు చేశారు. పేపర్ కోడ్, సబ్జెక్టులను సరిచేసుకోవాలన్నారు. పాఠశాలలోను చెక్ చేయాలన్నారు.

పరీక్షలలో పేపర్ కోడ్‌ను, పేపర్ సబ్జెక్టులను జాగ్రత్తగా చూసుకోవాలి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక పరీక్షలలో పేపర్ కోడ్‌ను, పేపర్ సబ్జెక్టులను జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా విద్యాధికారి అన్నారు. జిల్లాకేంద్రంలో సార్వత్రిక పరీక్షలలో భాగంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా సోమవారం జిల్లా విద్యాధికారి పోలీస్ వైర్లెస్ ద్వారా ఉదయం ఆయా పోలీస్ స్టేషన్‌లోని సూపరిండెంట్లతో, డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు.

డప్పు వాయించేందుకు వెళ్లి..
వడదెబ్బకు గురై ఇద్దరి మృతి



నిగులపు రాజేశ్వర్



.. రాజు(ఫైల్)

నిర్మల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తమ వృత్తిలో భాగంగా పోచమ్మ ఆలయం వద్ద జరుగుతున్న పండుగలో డప్పు వాయించేందుకు వెళ్లి.. ఇద్దరు మృతి చెందిన ఘటన జిల్లాలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కురన్నపేట్‌కు చెందిన నిగులపు శంకర్(45), నిగులపు రాజు(40)లు తమ కుల వృత్తి అయిన డప్పులు కొడుతూ జీవనం కొనసాగిస్తున్నారు. వృత్తిలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని పోచమ్మ ఆలయం వద్ద జరిగిన ఓ పండుగలో డప్పు కొట్టేందుకు వెళ్లారు. అయితే రోజంతా ఎండలో ఉండడంతో.. ఇంటికొచ్చాక సాయంత్రం వేళ వడ దెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబీకులు వెంటనే నిర్మల్‌లోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో శంకర్ ఆదివారం రాత్రి మృతి చెందగా.. రాజు సోమవారం ఉదయం 10 గంటలకు మరణించాడు. వడదెబ్బతో గంటల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందడం.. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

గ్రామాలను సందర్శించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలి

• జిల్లా ఎస్పీ జానకీషర్మిల



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను సందర్శించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని ఎస్పీ డా.జి.జానకీషర్మిల అన్నారు. జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల ఐపీఎస్ సోమవారం నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... ప్రతీ గ్రామాన్ని పోలీసు అధికారులు, గ్రామ పోలీసు అధికారులు సందర్శించి గ్రామాల్లో పూర్తిస్థాయిలో నిఘా ఉంచి ఎప్పటికప్పుడు నేరాలకు సంబంధించి సమాచారం ముందస్తుగా తెలుసుకోవాలన్నారు. ఏఎస్పీ, సీఐలు తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను, గ్రామాలను సందర్శించి, వారి పనితీరు సమీక్షించాలని, తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరవై నాలుగు గంటల పెట్రోలింగ్ గస్తీ ఉంచాలన్నారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని సూచించారు. యువ మారకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయిల్ ఇతర మత్తు పదార్థాల కారణంగా యువత భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందని, దీని వల్ల దేశ అభివృద్ధి, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలుగా మారి విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల యువ సైతం గంజాయి సేవించే స్థాయికి గంజాయి విక్రయాలు పెరిగాయని అందువల్ల క్షేత్రస్థాయి నుండి పోలీసు అధికారులు సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు పోలీస్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా పోలీసువిధులు ఉండాలని, వచ్చిన ఫిర్యాదుపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని, ఆయా కేసులలో నిందితులకు పడే శిక్షల శాతం మరింత పెరిగేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని, ట్రయల్స్ సమయంలో ఉన్నతాధికారులు మానిటర్ చేయాలని, అలాగే టెక్నాలజీ వినియోగాన్ని, రైటర్స్, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, సీడీపీవోకు వర్టికల్ వారిగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్గనైజ్డ్ క్రైమ్, ప్రాపర్టీ నేరాలు జరుగకుండా ముందస్తు సమాచారంతోనే నియంత్రించాలని, రాత్రి గస్తీని మరింత పెంచాలని అవసరమైతే పట్టణాల్లో సైక్లింగ్ చేస్తూ గస్తీ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్స్‌ను గుర్తించి ఆ ప్రాంతాల్లో తగిన మార్పులు చేర్పులు చేపట్టాలని, ప్రతీప్యాటల్ రోడ్డు ప్రమాదాన్ని ఎస్‌హెచ్‌వో స్వయంగా సమీక్షించాలన్నారు. తనిఖీలు చేసి ప్రతీరోజు ఎక్కువ మొత్తంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారి జంక్షన్ దగ్గర జిల్లాలోని ప్రతీగ్రామం, మున్సిపాలిటీ వార్డులలో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన చోట పని చేయని కెమెరాలను పునరుద్ధరించడం లేదా మార్పు చేయాలన్నారు. అన్ని కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానాన్నిచ్చి పర్యవేక్షించాలన్నారు. అధికారులు తమ పరిధిలో శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, నిత్యం ఫీల్డ్‌లో ఉండాలని, హత్య కేసులో నిందితులుగా ఉన్న వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేయాలన్నారు. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ నిఘా ఉంచాలని, గ్రామాల్లో వాట్సాప్ గ్రూప్‌లలో సైతం నిఘా ఉంచాలన్నారు. మహిళలపై జరిగే నేరాలు, వేధింపులపై అలసత్వం వద్దని, అట్టి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారి, అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీసుశాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అక్రమ బెట్టింగ్‌యాప్స్‌లలో బెట్టింగ్‌లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్పీ తెలియజేశారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌ఫ్రాడ్‌ల మీద అవగాహన కల్పించి వాటి బారిన పడకుండా చూడాలని తెలియజేశారు. ట్రాఫిక్ నియంత్రణపై, రోడ్డు ప్రమాదాలపై, రోడ్డు ప్రమాదాలు జరిగే కారణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందులో భాగంగానే ఇటీవల ట్రాఫిక్ నియంత్రణ సామాగ్రిని అన్ని పోలీస్ స్టేషన్లకు సరఫరా చేశామని, వాటిని సమర్థవంతంగా వినియోగించాలన్నారు. ఆన్‌లౌన్ బెట్టింగ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీసుశాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అక్రమ బెట్టింగ్ యాప్స్‌లలో బెట్టింగ్‌లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమింట్ యాప్‌లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ తెలియజేశారు. పోలీస్ అక్క, నారీశక్తి, ప్రజావాణి, కార్యక్రమాలను పోలీసుస్టేషన్ పరిధిలో సీనియర్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేష్‌మీనా ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు అజయ్, సైలు, గోపినాథ్, గోవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, మల్లేష్, సమ్మయ్య, ఆర్ఐ రామ్‌నిరంజన్‌రావు, రమేష్, ఎస్సైలు, ప్రొబేషనరీ ఎస్సైలు పాల్గొన్నారు.

ఎండతీవ్రత పెరుగుతోంది.. జాగ్రతలు పాటించాలి

• ఉపాధి హామీ కూలీలకు గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ సూచన



జాతీయ ఉపాధిహామి కూలీలకు అవగాహన కల్పిస్తున్న గ్రామీణ అభివృద్ధి అధికారి

సారంగాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఎండ తీవ్రతపై జాతీయ ఉపాధిహామి కూలీలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలో గల అటవీ ప్రాంతంలో జాతీయ ఉపాధిహామి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉదయం 7 గంటలకే కూలీ పనులను వచ్చి ఎండలు రాక ముందే పనులను ముగించుకొని వెళ్లాలని కూలీలకు సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో అత్యవసర సమయంలోనే ఆరు బయటకు వెళ్లాలని అన్నారు. అనంతరం ఉపాధి కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే సేంద్రియ ఎరువు తయారీ పరిశీలించి ఎరువుల తయారీని ఎప్పటికప్పుడు పరిశీస్తుండాలని అధికారులకు ఆదేశించారు. ఉపాధి హామి కూలీలు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజిస్‌కాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, టీఏ సునీల్, పంచాయతీ సెక్రటరీ కృష్ణ, ఎఫ్ఏ శ్రీనివాస్, గ్రామాల పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ కూలీలున్నారు.

రుణాల పంపిణీలో రిజర్వేషన్ కల్పించాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే రుణాల పంపిణీలోను 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారిని గుర్తించి రాజకీయాలకు అతీతంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. గంగాధర్, రమణ, నరేందర్ పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన అల్లోల

లక్ష్మణచాంద, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మండలంలోని పలువురిని సోమవారం పరామర్శించారు. మండల కేంద్రమైన లక్ష్మణచాందలో అష్టభుజ వేణుగోపాలస్వామి ఆలయ పూజారి రమేష్‌శర్మ మరణించగా ఆయన కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాపట్ల ఆశన్న కోడలు బాపట్ల హేమశ్రీ మరణించగా ఆమె అంత్యక్రియలకు హాజరై ప్రగాఢ సాను భూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, ఓస రాజేశ్వర్, కేశం రమేష్, మేకల రాజేందర్ యాదవ్, అర్జున్‌రెడ్డి, కల్లెడ భూమన్న, రజనీకాంత్, శ్రీకాంత్ యాదవ్, అనుముల భాస్కర్, రవి కిరణ్, తదితరులు ఉన్నారు.



సిద్దులకుంట గ్రామంలోబాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సోన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దులకుంట గ్రామంలో ఎన్. రాజారెడ్డి తల్లి భూమవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట గంగారెడ్డి, సతీష్‌రెడ్డి, రాజు, చిన్నారెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అనుముల భాస్కర్, తదితరులు ఉన్నారు.

సోన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పాట్ల గ్రామంలో గడ్డం రాజారెడ్డి తండ్రి గడ్డం నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట వై.గంగారెడ్డి మాజీ సర్పంచ్, ఎం. ముత్యంరెడ్డి, రమేష్‌రెడ్డి, వి.ముత్యంరెడ్డి, నక్కల నర్సయ్య, ముత్యం, ప్రేమ్ కుమార్, నవీన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వి. రాజారెడ్డి, సాగర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, లోకేష్, జనార్ధన్, శ్రీకాంత్ యాదవ్ మాజీ ఏఎంసీ చైర్మన్, అనుముల భాస్కర్, తదితరులు ఉన్నారు.

కవులకు సన్మానం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో నిర్మల్ కవులకు సాహిత్య సన్మానం చేసినట్లు కవియాత్ర జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కారంశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జ్యోతి బాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈసవేణి మనోజ్‌యాదవ్ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఎకరాల జొన్నపంట దగ్ధం



దగ్ధమైన జొన్న పంట

ఉట్నూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలెవాడ (కే)కు చెందిన రైతు రబడే రాము వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ సంభవించి రెండు ఎకరాల జొన్న పంట దగ్ధమైనట్లు రైతు తెలిపారు. జొన్న పంటలో షార్ట్‌సర్క్యూట్ రావడంతో రెండు ఎకరాలలో ఉన్న జొన్నపంట దగ్ధం కావడం వల్ల సుమారు లక్ష రూపాయల కంటే అధికంగా ఆర్థికనష్టం జరిగిందని విద్యుత్ అధికారుల ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని రైతు కోరుతున్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

బేల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఎల్‌వన్ లిస్టు నుంచి ఎలిజిబుల్ అంటే అర్హత ఉన్న వారిని ఎంపికచేయనున్నారు. గ్రామపంచాయతీలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య ఆధారంగా అర్హులైన పేద వారిని గుర్తించి వారిని ఎంపిక చేయాలని, ఎట్టి పరిస్థితులో అనర్హులను ఎంపిక చేయవద్దని, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, బేల మండల పంచాయతీ అధికారి కే.మహేష్ కుమార్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును అమలు చేయాలి

● మంత్రిని కోరిన ఈఆర్‌పీలు



వినతిపత్రం ఇస్తున్న ఈఆర్‌పీలు

ఉట్నూర్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న దివ్యాంగుల విద్యార్థులకు బోధిస్తున్న ఈఆర్‌పీల సమస్యలను సుప్రీం తీర్పు అనుసరించి ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని ఈఆర్పీల సంఘం నాయకులు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను కోరారు. జిల్లాకు వచ్చిన మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దివ్యాంగుల విద్యాభివృద్ధి కోసం కృషిచేస్తున్న ఈఆర్‌పీలను రెగ్యులర్‌చేసి పేస్కేల్ వర్తింపచేయాలన్నారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న ఈఆర్పీల సమస్యలను సుప్రీం కోర్టు గౌరవించినందున తెలంగాణ ప్రభుత్వం కూడా గౌరవించి తమకు న్యాయం చేసేలా రాష్ట్ర మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సీతక్క సైతం తమ సమస్యలను ఓపికగా విని సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఆత్రం అర్జున్, జిల్లా నాయకులు నరేష్, రమేష్‌లు ఉన్నారు.

నేడు జైనథ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనథ్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు జైనథ్ సహకార సంఘం సీఈఓ జి.గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య



కజ్జర్లలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

తలమడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కజ్జర్లలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, అలాగే ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారిని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలో చేరమని కోరారు. ఇటీవల జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షలో పాఠశాల నుంచి తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికరయ్యారని, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నిష్ణాతులైన ఉపాధ్యయబృందం ఉందని, అలాగే ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతి గురించి తెలియపర్చడం జరుగుతుందని, కంప్యూటర్ విద్యాబోధన జరుగుతుందని గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అలుగంటి కిష్టాబాయి, మాజీ సర్పంచ్ మొట్టే కిరన్ వెంకటమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము జ్యోతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

● గిమ్మ హెచ్‌ఎం మహేందర్

జైనథ్ : జైనథ్ మండలంలోని ఆయా గ్రామాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.మహేందర్ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా జైనథ్ ఉమ్మడి మండలంలోని గిమ్మాగ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు పలు సలహాలు సూచనలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫై అయిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఆంగ్లమాధ్యం విద్యా అందుబాటులో ఉందన్నారు. మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వి.అశోక్, ఎం.మహేందర్, ఎ.శ్రీకాంత్, బాలకృష్ణతో పాటు తల్లి దండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

సోనాల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతిపై మధ్యాహ్నం ఒంటి గంటకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ పనితీరు భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితర అంశాలపై ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, రైతులకు, రైతు కూలీలకు అవగాహన కల్పిస్తామన్నారు. ధరణి సమయంలో పరిష్కారం కాని రైతులు భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బోథ్ : మండలంలోని దన్నూర్ గ్రామంలో భూ భారతి పోర్టల్‌పైన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుభాష్ చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు తెలిపారు. సదస్సు దన్నూరు గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను గ్రామ రైతులతో పాటు చుట్టూ పక్కల గ్రామాల రైతులు సకాలంలో హాజరు కావాలని అన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



లింగట్లలో టీకాలు వేస్తున్న డాక్టర్ రాథోడ్ జీవన్

నేరడిగొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పశువులకు సోకేవ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ జీవన్ రాథోడ్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని లింగట్ల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి

పాలేరు ఆత్మహత్య



మృతిచెందిన నైతం భూమన్న

బోథ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలవాడ గ్రామానికి చెందిన నైతం భూమన్న(30) అనే వ్యక్తి సోమవారం ఉదయం 10.30 గంటలప్రాంతంలో పురుగుల మందు తాగాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులు బోథ్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. కాగా మృతుడు అతిగా మద్యం తాగి ఇంటి వద్ద గొడవపడ్డట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు మండల కేంద్రంలోని బొడ్డు గంగయ్య అనే వ్యక్తి వద్ద పాలేరుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రక్తదానం చేసిన యువకుడు

బోథ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోయిడి ఆకాష్ నిర్మల్‌లోని ఓ మహిళకు ఆపరేషన్ సమయంలో అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో సోమవారం నిర్మల్‌లోని ఆసుపత్రికి వెళ్లి రక్తాన్ని దానం చేశారు. మహిళకు బీ ప్లెస్ రక్తం గ్రూపు అవసరం కావడంతో ఆయన రక్తదానం చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గిమ్మాబడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వందన అన్నారు. సోమవారం మండలంలోని ధన్నేర్ (బీ) జనతాగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకత, రక్తహీనత, పోషన్, ప్రీ స్కూల్ గురించి అవగాహన కల్పించారు. ఇందులో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

క్లస్టర్ల వారీగా జొన్న పంట కొనుగోలు

బోథ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బోథ్ యార్డులో కొనుగోలు చేయనున్న జొన్న పంటను క్లస్టర్ల వారీగా కొనుగోలు చేస్తామని సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. ఆయా తేదీల వారీగా రైతులు పంటను మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. గ్రామాల వారీగా కేటాయించిన తేదీల వివరాలను గ్రామాల ఏఈవోలను గాని తమ కార్యాలయంలో గాని మార్కెట్ కమిటీ కార్యాలయంలో అడిగి తెలుసుకున్నారు. రైతులు ఈ విషయంపై సహకరించాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీం కింద బకాయిలు చెల్లించక పోవడంతో పిల్లల చదువు భారంగా మారిందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు వేదవ్యాస్ మాట్లాడుతూ. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే ప్రైవేట్ విద్య సంస్థలకు చెల్లించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ విరాళం



సీలింగ్ ఫ్యాన్‌ను అందజేస్తున్న దృశ్యం

ఉట్నూర్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలం లక్కారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఫ్యాన్‌లేక ఇబ్బంది పడ్డారు. దీంతో వారి తల్లిదండ్రులు సామాజిక కార్యకర్త జాదవ్‌రవికి ఈ విషయాన్ని తెలిపారు. ఆయన అంగన్‌వాడీ పాఠశాలకు చేరుకుని అంగన్‌వాడీ టీచర్ పద్మను సంప్రదించి సీలింగ్ ఫ్యాన్‌ను సోమవారం విరాళంగా అందించారు. వెంటనే స్పందించి అంగన్‌వాడీ కేంద్రంకు ఫ్యాన్ విరాళంగా అందించడంతో పలువురు జాదవ్‌రవిని అభినందించారు.

తొండాల గ్రామంలో..

ఘనంగా మహాదేవుని విగ్రహ ప్రతిష్ఠాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాంరావు పాటిల్

తానూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొండాల గ్రామంలో సోమవారం మహాదేవుని విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రామరావుపాటిల్, మాజీ ఎమ్మెల్యేలు విఠలరెడ్డి, నారాయణపటేల్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరుకోగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ఆలయ పునఃనిర్మాణం చేసి నూతనంగా మహాదేవుని విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం ఆలయ నిర్మాణ చిత్రపటాలను ఆవిష్కరించారు. గ్రామంలో శివనామ స్మరణ సంకీర్తనలు, భజన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌పటేల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుండ్లీక్, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులున్నారు.

లోకేశ్వరం మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో దాహరం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. సోమవారం లోకేశ్వరం మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ముందర ముదెల్ల లిప్సిక జ్ఞాపకార్థం చలివేంద్రంను పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన ఎస్. గంగాధర్‌ను అభినందించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, లోకేశ్వరం మాజీ సర్పంచ్ కపిల్ సౌజన్య, హవర్గా మాజీ సర్పంచ్ భుజంగరావు, లోకేశ్వరం వీడీసీ అధ్యక్షులు భోజన్న, పీఏసీఎస్ డైరెక్టర్ బండి ప్రశాంత్, హరీష్, రాజు, రమేష్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కృషి వల్లే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న సీరం సుష్మ

భైంసా రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కృషి వల్లే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని బీజేపీ భైంసా మండల అధ్యక్షురాలు సీఎం సుష్మరెడ్డి అన్నారు. మండలంలోని మాంజ్రి గ్రామంలో సోమవారం అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వల్ల నేడు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం దళితుల ఇంట అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంబేద్కర్ ఆశయసాధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సమ న్యాయం కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపమన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సాంప్లీ రమేష్, బీజేపీ మండల అధ్యక్షురాలు సీరం సుష్మ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చాకేటి లస్మన్న, నాయకులు పండిత్ రావు పటేల్, మాజీ సర్పంచ్‌లు రాందాస్, హన్మండ్లు, బూత్ అధ్యక్షులు నర్సయ్య, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ సాయినాథ్, కో కన్వీనర్ దేవిదాస్, నాయకులు యోగేష్, ఆకాష్, సురేష్ పటేల్, భుజంగ్, జే. లక్ష్మణ్, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టెండర్ తర్వాతే ఫీజు వసూళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోండి

● నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు భైంసా బీజేపీ పట్టణ కమిటీ విజ్ఞప్తి

భైంసా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని మున్సిపల్ ఆధ్వర్యంలో చిరువ్యాపారుల వద్ద నుండి వసూళ్లు చేస్తున్న ఫీజును టెండర్ నిర్వహించిన తర్వాతే వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు బీజేపీ పట్టణ కమిటి విజ్ఞప్తి చేసింది. సోమవారం భైంసాలోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌కు పట్టణ అధ్యక్షులు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు వినతి పత్రం అందజేశారు. గత మార్చి నెలతో లైబజార్ టెండర్ ముగిసిన ఇంకా సదరు కాంట్రాక్టర్ చిరు వ్యాపారుల నుంచి ఫీజును వసూళు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా ఒక వర్గానికి చెందిన చిరు వ్యాపారుల నుంచి ఫీజు వసూళ్ల చేయడం సరికాదన్నారు. ప్రతి రోజు రూ. 5వేల వరకు ఫీజు వసూలు అవుతుందని, నెలకు రూ. 1.50లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ దిశగా త్వరగా కొత్తగా టెండర్ వేసి మున్సిపల్ ఆదాయానికి గండి పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ అభిలాష అభినవ్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి టెండర్ వేసేలా చర్యలు తీసుకుంటాననీ హామీచ్చారు. ఇందులో బీజేపీ శ్రేణులు లింగోజి, బండారి దిలీప్, కాసరోల్ల ప్రవీణ్ తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లింబాద్రి

కుంటాల, ఏప్రిల్, 21 : (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికతో పాటు ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాలలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఇండ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. లబ్ధిదారులు ఎంపిక అనంతరం ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ నరేష్ గౌడ్, ఎంఈవో ముత్యం, ఏఈవో విక్రమ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాల అందజేత

దిలావర్‌పూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ ఉన్నత పాఠశాల, అంకుర్ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు వార్షికప్రగతి పత్రాలను అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయికిరణ్, సుష్మ, పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పోషకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గ్రామకమిటీ సభ్యులను అవగాహన



కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల రైతు వేదికలో సోమవారం ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులకు అధికారులు బలిక్ అహ్మద్, ఎంపీవో అజిజ్‌ఖాన్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామ కమిటటీ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి గ్రామంలో ఖాళీ స్థలం ఉండి నూతనంగా ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులతో పాటు వికలాంగులకు, ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సభ్యులతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజీ నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్ , రాజేశ్వర్, నాయకులు సాకొపెల్లి సురేందర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

పేదింటి బిడ్డ పెళ్లికు అండగా నిలిచారు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చెంచుఘాట్‌కు చెందిన నిరుపేద యువతి పెళ్లి ఖర్చులకు గ్రామస్తులు సాయం చేసి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. కుమ్ర శోభారాణి, కుమ్ర రాజు పటేల్ గ్రామస్తులు కలిసి పెళ్లి కూతురు తండ్రి అర్కా షెడ్మారావుకు రూ.55 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు కలగకుండా పెళ్లి దుస్తులు, ఇతర వస్తువులు, కానుకలు ఇవ్వడానికి తగ్గించాలని గ్రామస్థులు తీర్మానం చేశారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి



యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా చూడాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి శాంతన్‌రావు కోరారు. నిర్మల్ జిల్లాకేంద్రంలో సోమవారం యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన ఆయన మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు సమర సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండలంలోని గొల్లమాడ కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా కార్యవర్గ సభ్యులు, యూత్ నియోజకవర్గ అధ్యక్షులు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



నిర్మల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రత్నాపూర్ గ్రామంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఏఎస్సై బాబారావు తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా గుర్తుపడితే రూరల్ పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామస్థుల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో సోమవారం మహిళా ఆత్మహత్య చేసుకుందని ఏఎస్సై దేవేందర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లపెల్లి గ్రామానికి చెందిన జ్యోతి, తన భర్త ఇద్దరూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో చికిత్సకు అప్పులైనందున ఆర్థిక ఇబ్బందుల వలన మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

జెవిలి, మాచాపూర్ గ్రామాలకు బస్సులు ప్రారంభం



నిర్మల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు జెవిలి, మాచాపూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు పునఃప్రారంభించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... సారంగాపూర్ మండలంలోని జెవిలి గ్రామం, లక్ష్మణచాంద మండలంలోని మాచాపూర్ గ్రామానికి రోడ్డు సర్వే నిర్వహించి జెవిలి గ్రామానికి మూడు ట్రిప్పులు అలాగే లక్ష్మణచాంద మండలంలోని మాచాపూర్ గ్రామానికి రెండు ట్రిప్పులు బస్సు సౌకర్యం ఉంటుందని ఈ గ్రామాల ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు.



పచ్చని చెట్లతో ఇంటి ఆవరణ



మొక్కలకు నీరు పడుతున్న దృశ్యం



ఇంట్లో పెంచుతున్న మొక్కలు

ఆ ఇల్లే నందన వనం

కుభీర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటి ఆరణలోకి అడుగు పెట్టగానే చల్లని వాతావరణం, పచ్చనిచెట్లు, ఔషధ, పూలమొక్కలు స్వాగతం పలుకుతాయి. ఇంటిని పచ్చదనంతో నింపేసి పొదరిల్లుగా మార్చుకున్న తీరు ఆకట్టుకుంటోంది. కుభీర్ మండల కేంద్రానికి చెందిన వడ్నం జ్యోతి నాగేశ్వర్ దంపతులు ఎంతోఇష్టంగా మొక్కలను పెంచుతున్నారు. గత 15 ఏళ్లుగా ఇంటి ఆవరణలోనే వివిధ రకాల పూలు, పండ్లు, అరటి, మామిడి, నిమ్మ, కొబ్బరి పండ్ల మొక్కలు, మునగ, వంగ, టమాట, వంటి కూరగాయలు, పాలకూర, మెంతి, మందార, చామంతి, మల్లే, కనకాంబరం వంటి పూల మొక్కలు, తులసి, సబ్జా, వేప, రణపాల, కలబంద, తమలపాకు, జామ ఉసిరి, విరజాజీ, సన్నజాజీ, పారిజాతం, గడ్డి బంతిలాంటి అనేక రకాల పూల మొక్కలు పెంచుతున్నారు. వంట గదిలోని వ్యర్థాలు, చెట్ల కింది ఎండిన ఆకులు కుళ్లిన కూరగాయలతో సేంద్రియ ఎరువుగా మార్చి మొక్కలకు వినియోగిస్తున్నారు. పనికి రాని వస్తువులు టబ్బులు, ప్లాస్టిక్ బకెట్‌లు, కుండీల్లో మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే సుమారు రూ.లక్షకు పైగా వ్యయంతో కావాల్సిన వందలాది మొక్కలు పెంచుతూ తన సంతోషాన్ని మొక్కల్లో చూసుకుంటున్నారు. వృక్షోరక్షతి రక్షితః అని దృఢంగా నమ్మిన ఈ వ్యక్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన రోజు సాటి ఉపాధ్యాయులు, మిత్రులు ఇతనికి మొక్కలను జ్ఞాపికలుగా అందజేశారు. నాటిన మొక్కల నుంచి పూసేపువ్వులు, స్నేహితులకు, బంధువులకు, గ్రామస్థులు ఇక్కడి నుండి ఉచితంగా తీసుకెళతారు.

మానసిక ఆనందం : వడ్నం జ్యోతి నాగేశ్వర్

మొక్కలను పెంచడం నాకు ఎంతో మానసిక ఆనందాన్నిస్తోంది. ఉదయం, సాయంత్రం వాటిమధ్య గడుపుతాను. ఆ సమయంలో నీళ్లు పట్టించడం, పొదలను తొలగించడం చేస్తాను. సేంద్రియ ఎరువులను తయారు చేసి వాడతాను. వేస్తాను. బయట కొనే వాటిలో నాణ్యత తగ్గుతోంది.



గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ తదితరులు

ప్రాచీన కళలకు పూర్వవైభవం తేవాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పోకడలతో ప్రాశస్త్యాన్ని కోల్పోతున్న ప్రాచీన కళలకు పూర్వవైభవం తీసుకరావాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలో శ్రీ నయనం నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్స్ అసోసియేషన్ భవన్‌లో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సక్సెస్ మీట్ 2025 పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాశ్చత్యధోరణి విధానాలతో అన్నింటా విషసంస్కృతి రాజ్యమేలుతోందన్నారు. ఈ క్రమంలో సంస్కృతి, సంప్రయదాయలతో పాటు సనాతనమైన ఆచార, వ్యవహారాలు అంతరించిపోతున్నాయన్నారు. ప్రాచీన కళలు కనమరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో భైంసా కేంద్రంగా డా. రంగు సౌమ్యసంపత్ ప్రాచీణ సాంస్కృతిక కళలైన కూచిపూడి, భరత నాట్య రంగాలపై చిన్నారులు మక్కువ పెంచుకునేలా, అసక్తి కలిగించేలా శిక్షణను అందివ్వడం అభినందనీయమన్నారు. చిన్నారులు రెండు రంగాలలో నిష్ణాతులుగా తీర్చిదిద్ది వారి పేర్లు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కేలా కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. చిన్నారులకు నృత్యశిక్షణతోపాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ వారిని జాగృతపరచేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేయించి తద్వారా విద్యార్థులు, యువతీ, యువకుల అభిరుచులక అనుగుణంగా ఆయారంగాల్లో అవసరమైన శిక్షణను అందించి వారిని ని ష్ణాతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ము ందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. నిర్వాహకురాలు డా.సౌమ్యసంపత్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ మాసంలో హైదరాబాద్‌లో కూచిపూడి కళావైభవం పేరిట మహాబృంద నాట్య ప్రదర్శన జరుగగా ఇందులో పాల్గొన్న నృత్య కళాకారులందరికి గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కిందని వివరించారు. అంతరించిపోతున్న ప్రాచీన కళలకు జీవం పోసి పూర్వవైభం వైభవం తీసుకరావడంతో తమ లక్ష్యమని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారు అందచేసిన సర్టిఫికెట్లను చిన్నారులకు అందచేశారు. ఇందులో ఎంసీటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డా.నగేష్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సాధం నారాయణ, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డా.రజనీకాంత్, బీజేపీ భైంసాపట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, సిరం సుష్మారెడ్డి, స్వర్ణకార సంఘం భైంసా అధ్యక్షులు బెజ్జంకి రవి, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, పీఆర్‌టీయూ మహిళా ప్రతినిధి వందన పాల్గొన్నారు.



నీటి కోసం వాగులోకి దిగిన పశువులు

నీటి కోసం మూగజీవాల వెతలు

తాంసి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు మూగజీవాలకూ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఓ వైపు మేత లేక మరోవైపు నీరు దొరకక మూగజీవాలు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. తాంసి మండలంలోని ఏ ఒక్క వాగులో సైతం చుక్కనీరు లేకుండా ఎండిపోయాయి. దీంతో మూగజీవాలకు నీటికరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామాల్లోనే పశువులకు నీటి తొట్టేలు ఏర్పాటుచేసి వాటి నీటి సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

అటవీ జాతుల విత్తనాలు, ఫలాల ప్రదర్శన



విత్తనాలు, ఫలాలు వాటి జాతులను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): అటవీలోని ప్రధానమైన చెట్ల విత్తనాలు, ఫలాలను సోమవారం ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. వి.మధు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రదర్శించారు. దాదాపుగా 50 రకాలకు పైగా చెట్ల విత్తనాలు సేకరించారు. ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యశాలలో ప్రదర్శించగా అక్కడి అధికారులు అభినందించారన్నారు. అంతరించిపోతున్న అటవులపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండడంతోపాటు వాటి సంరక్షణకు పాటుపడాలనే ఉద్దేశంతో వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. వాటి ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్, అధ్యాపకులు సరస్వతి, అనిత, మురళి,నర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కూచాడి శ్రీహరిరావు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కూచాడి

సోన్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్ సాగర్ ఇటీవల దుబాయ్ దేశంలో హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సోమవారం ప్రేమ్‌సాగర్ నివాసానికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించి తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రూ.10వేల ఆర్థికసహాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతున్నారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఈటల శ్రీనివాస్, అంబేకర్ ప్రసాద్, భూ రాజ్, గడ్డం నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శ

సోన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలే దుబాయ్‌లో పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయనవెంట మాజీ సర్పంచ్ వినోద్ కుమార్, తదితరులు ఉన్నారు.



ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

ఎండలో గొడుగులతో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

బాసర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన కొనసాగుతోంది. రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్ విధులను బహిష్కరించి గత కొన్నిరోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. 13వ రోజు సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎండలో గొడుగులతో నిల్చుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాట్లాడుతూ గత 13 రోజులుగా విధలను బహిష్కరించి నిరసన తెలుపుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆసెంబ్లీలో తమ సమస్యలపై గళమెత్తి ఇప్పుడు పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో సైతం తమకు ఇచ్చిన హామీని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. యూనివర్సిటీ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ప్లకార్డులు, నినాదాలతో నిరసన కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఉపేందర్, కృష్ణ ప్రసాద్, కుమార్ రాగుల, డాక్టర్ పావని, డాక్టర్ శ్వేత, రాకేష్ రెడ్డి, రాకేష్ రోషన్, విట్టల్, కాశన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గొడుగులు పట్టుకొని నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

దేవాలయమే ఓ క్రీడా ప్రాంగణం!

ఫొటో న్యూస్

సిరికొండ మండలంలోని వాయిపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెమ్మన్‌గుడి గ్రామంలో హనుమాన్ ఆలయంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు, నాయకులు దేవాలయం ప్రాంగణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంపై గ్రామ పంచాయతీ ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ఇదే..

ఘనంగా శబరిమాత ఆలయ వార్షికోత్సవం

బోథ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూర్ శబరిమత ఆశ్రమంలో సోమవారం ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పూట గీత పారాయణాన్ని వివరించారు అనంతరం హోమగుండం వద్ద యజ్ఞం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ఊరేగింపు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ఆశ్రమంలో హోమగుండం వద్ద పాల్గొన్న భక్తులు

భూ భారతితో సమస్యల పరిష్కారం

● సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం ● భూ భారతి అవగాహన సదస్సుల్లో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు వారి భూములపై సమగ్ర హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూభారతి (నూతన ఆర్.ఓ.ఆర్) - 2025 తెచ్చిందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఆదివారం బాసర రైతువేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ధరణి ద్వారా పరిష్కారంకాని సమస్యలకు కొత్త భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు వీలు కల్పించిందని వివరించారు. భూముల హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణ కోసం కొత్తచట్టం అమలులో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని, ఆ దరఖాస్తు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ వద్ద అప్పీల్, ఆపై ల్యాండ్ ట్రిబ్యూనల్ వద్ద ఈ అవకాశాలు ఉన్నాయని వివరించారు. పురాతన అప్పీల్ వ్యవస్థతో పోలిస్తే ఈ కొత్తరెవెన్యూ కోర్టుల ద్వారా రైతులకు వేగవంతమైన న్యాయం లభిస్తుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు ఉచితన్యాయ సహాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ రికార్డులను తయారు చేసి వార్షికంగా వాటిని ప్రజల ముందు ప్రదర్శిస్తారని, ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయింటి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అవగహన సదస్సులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రమణ ,తహసిల్దార్ పవన చంద్ర, ఎంపీడీవో అశోక్, రైతులున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం కలెక్టర్ ఆలయ పరిసరాల్లో స్వచ్ఛత, భద్రతాఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల సౌకర్యాల కోసం మెరుగైన ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ముథోల్: భూభారతి చట్టం భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. ముథోల్ మండలంలోని కారేగాంలో సోమవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ధరణి వ్యవస్థతో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు భూ భారతి చట్టం వాటికి సరైన పరిష్కారం అందించనుందని వివరించారు. ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రైతులు తమ హక్కులను చట్టబద్ధంగా నమోదు చేసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆర్ఓఆర్ అప్డేషన్, సక్సెషన్, మ్యుటేషన్ వంటి సేవలు భూ భారతిలో సులభంగా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కొత్త చట్టంతో 90శాతం భూసమస్యలు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారం అయ్యే అవకాశం ఉందని, కేవలం 10 శాతం మాత్రమే ఆర్డీవో, కలెక్టర్‌స్థాయికి వెళ్తాయని చెప్పారు. భూభారతి మార్గదర్శకాలను పవర్ పాయింట్ ద్వారా రైతులకు వివరించారు. పలు రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిం చగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.అలాగే కారే గాం గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను గ్రామ సభలో ఎంపిక చేసిన పేర్లను కాకుండా వేరే పేర్లు వ చ్చాయని ఓ యువకుడు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చా రు. వెంటనే కలెక్టర్ ఈ సమస్యను నోట్ చేసుకున్నారు. రైతుల సమస్యల కొరకు వెంటనే రైతు వేదిక వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. తమ సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రాథోడ్ సుదర్శన్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివ కుమార్, ఏపీవో శిరీష రెడ్డి, ఏవో రచన, నాయకులు గంగారెడ్డి, సాయంరెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ముథోల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్


పెండింగ్ సీఎంఆర్ బకాయిలను చెల్లించండి

భైంసా: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ రైస్‌మిల్లుల యాజమానులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఆర్డీవో కార్యాలయంలో రైస్‌మిల్లుల యాజమానులతో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మిల్లర్లుప్రాసెసింగ్‌కు తీసుకున్న ధాన్యానికి సంబంధించి బకాయిలు ఇంకా చెల్లించలేదన్నారు. రైస్‌మిల్లర్ల వారీగా పెండింగ్ బకాయిలను త్వరగా చెల్లించాలని సూచించారు. ఆ దిశగా రెవెన్యూ రికవరీ చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మిల్లింగ్ ప్రక్రియలో పారదర్శకత తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు ఆర్డీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్ పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఆర్డీఓ కోమల్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం సుధాకర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, రైస్‌మిల్లర్లు, తదితరులు ఉన్నారు.



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.7, కనిష్ఠం 26.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

మంగళవారం 22 ఏప్రిల్ 2025

అగ్నిగుండం!



• ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- జిల్లాలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- పగలంతా భగ భగ.. రాత్రంతా ఉక్కపోత
- జిల్లాపై కొనసాగుతున్న వడగాలుల ప్రభావం
- ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించిన అధికారులు
- అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు



నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఆదిలాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. ఠారెత్తిస్తున్న ఎండలతో జిల్లా అగ్నిగుండంలా మారుతోంది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతేడు వేసవి సీజనలో అత్యధికంగా 45.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ యేడు ఇప్పటికే 43.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన రేపుతోంది. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రతల ప్రభావం మరింత ఎక్కువగానే ఉంటుందని భారతీయ వాతావరణ పరిశీలన విభాగం (ఐఎండీ) అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీచేస్తున్నారు. మండుతున్న ఎండల దాటికి చిరు వ్యాపారులు, రైతులు, ఉపాధి కూలీలు అల్లాడుతున్నారు. అలాగే భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, ప్రాజెక్టులు అడుగంటుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దంటూ సూచిస్తున్నారు. ఇప్పటికే వడదెబ్బ బారిన పడి జిల్లాలో ఒకరిద్దరు మృతి చెందిన అధికారికంగా మాత్రం ఎలాంటి మరణాలు జరగలేదంటూ అధికారులు వెల్లడిస్తున్నారు. వేసవి పరిస్థితుల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానియాలను ఆశ్రయిస్తుండగా నోరు లేని మూగ జీవాలు పచ్చని చెట్ల నీడను ఆశ్రయిస్తూ సేద తీరుతున్నాయి. మరికొన్నాళ్ల పాటు అప్రమత్తంగా ఉంటేనే ఆపదలూ దూరమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

మండిపోతున్న ఎండలు..

ఈ యేడు ఏప్రిల్‌లోనే ఉష్ణోగ్రతల తీవ్రత అధికంగా కనిపిస్తుంది. పగలంతా భానుడి భగభగలు రాత్రంతా తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు జిల్లాపై వేడిగాలుల ప్రభావం కనిపిస్తోంది. గడిచిన వారం రోజుల్లోనే వడదెబ్బ బారిన పడి పలువురు అస్వస్థతకు గురికావడం చూస్తుంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా రైతు కూలీలు, ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వేసవిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతే వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అదే 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైతే తీవ్రమైన వడగాలుల ప్రభావం ఉంటుంది. ఉదయం 8గంటలకే భానుడి భగభగలు కనిపిస్తున్నాయి. సాయంత్రం 6గంటల వరకు బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. మండిపోతున్న ఎండలకు విద్యుత్ సరఫరాలో ఏ కొద్ది సేపు అంతరాయం తలెత్తితే భరించలేని ఉక్కపోత కనిపిస్తోంది. వచ్చే మే నెలలో విపరీతమైన ఎండల ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

వాతావరణ శాఖ హెచ్చరికలు..

పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో భారతీయ వాతావరణ పరిశీలన విభాగం అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రతను తెలుపడానికి వాతావరణ శాఖ నాలుగు రకాల అలర్ట్‌ను ప్రకటిస్తుంది. ఇందులో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతే గ్రీన్ అలర్ట్, ఓ మోస్తరుగా 35 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైతే ఎల్లో అలర్ట్, 40డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదైతే ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటిస్తారు. ఎట్టి పరిస్థితుల్లో ఎండలో తిరుగరా దంటూ హెచ్చరికలు జారీ చేస్తారు. అదే విధంగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైతే రెడ్ అలర్ట్‌గా ప్రకటించి ప్రమాదపు హెచ్చరికలు జారీ చేస్తారు. వారం రోజులుగా 42 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. దీంతో రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉన్నతాధి కారులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

	గరిష్ఠం	కనిష్ఠం
ఏప్రిల్ 15	40.3	27.7
ఏప్రిల్ 16	41.6	26.7
ఏప్రిల్ 17	40.8	27.7
ఏప్రిల్ 18	41.8	29.2
ఏప్రిల్ 19	41.3	28.2
ఏప్రిల్ 20	43.5	25.2
ఏప్రిల్ 21	43.7	26.7

సోమవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.7 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 26.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్‌లో 43.7, ఆదిలాబాద్ రూరల్‌లో 43.6 తలమడుగులో 43.5, జైనథ్‌లో 43.3, ఇంద్రవెల్లిలో 43.2 బోథ్‌లో 43.0

తగిన జాగ్రత్తలు పాటించాలి..

: శ్రీధర్‌చౌహాన్ (సీనియర్ శాస్త్రవేత్త, ఆదిలాబాద్)

జిల్లాలో పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా అత్యవసరమైతే ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు వెళ్లాలి. ఎట్టి పరిస్థితుల్లో మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లరాదు. మరో రెండు మూడు రోజుల పాటు జిల్లాపై వడగాలుల ప్రభావం ఉంటుంది. రైతులు, కూలీలు మధ్యాహ్నం సమయంలో తప్పని సరిగా విశ్రాంతి తీసుకోవాలి. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వేసవి పరిస్థితుల నుంచి బయట పడే అవకాశం ఉంటుంది.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి : బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు వహించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. అత్యవసరమైన పనులు ఉంటే తప్ప బయటకు వెళ్లకూడదని సూచించారు. ఎండలో బయటకు వెళ్లినప్పుడు రుమాలు ధరించి పనులు చేసుకోవాలని పేర్కొన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నార్నూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన చవాన్ కేశవ్ (60) వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 15 రోజులుగా ఉపాధి పనులకు వెళ్తున్నాడని, ఎండల తీవ్రత కారణంగా చవాన్ కేశవ్ మృతిచెందాడని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు గుంజ చిన్న తెలిపారు. ప్రభుత్వం పేద కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రధాని చేతుల మీదుగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు అవార్డు

- ప్రత్యేకంగా అభినందించిన నరేంద్రమోదీ
- సమష్టి కృషితోనే సాధ్యమైందన్న కలెక్టర్ రాజార్షిషా



అవార్డును అందుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అరుదైన అవార్డును అందుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ జిల్లా కలెక్టర్‌కు అవార్డును అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండల బ్లాక్‌ను అస్పిరేషనల్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషణ, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించి అభివృద్ధి పథంలో నిలిపారు. నార్నూర్ మండలం ప్రధాన మంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం - 2024 కింద ఎంపికైంది. ఇందుకు గాను జిల్లా కలెక్టర్‌కు ఈ అరుదైన అవార్డు దక్కింది. పలు విభాగాల్లో జిల్లా కలెక్టర్ మెరుగైన పనితీరును కనబర్చినట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఈ అవార్డును అందుకోవడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధుల సహకారం, అధికార యంత్రాంగం కృషి ఫలితంగానే జిల్లాకు ఈ అవార్డు వచ్చిందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరు సమిష్టిగా కృషి చేయడం ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

భూకబ్జాలు బయట పడతాయనే
కాంగ్రెస్‌తో ఎమ్మెల్యే పాయల దోస్తీ

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కందిశ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ భూకబ్జాల బాగోతం బయట పడుతుందన్న భయంతోనే ఆయన కాంగ్రెస్‌తో దోస్తీ చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయల శంకర్ ల్యాండ్ మాఫియాను పెంచి పోషిస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను కబ్జాచేస్తూ పేదల నోట్లో మట్టి కొడుతున్నాడని మండిపడ్డారు. తన భూభాగోతం, అక్రమాలకు అడ్డువచ్చే వారిపై భౌతిక దాడులకు కూడా వెనుకాడడం లేదన్నారు. తన ఆర్థిక, రాజకీయ ఎదుగుదల కోసం ఎంతకైనా బరి తెగిస్తున్నారని ఆరోపించారు. తన కుమారుడిని ఉసిగొలిపి దాడులకు ప్రేరేపించడం ఎమ్మెల్యేకు అలవాటుగానే మారిందన్నారు. ఎక్కడ తన అవినీతి, భూకబ్జాల బాగోతం బయట పడుతుందన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని పలువురు మంత్రులతో సన్నిహితంగా ఉంటున్నాడని విమర్శించారు. తనను కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే అనుకోవాలని నిసిగ్గుగా ఒకరిద్దరు మంత్రులతో ఎమ్మెల్యే అన్నట్లుగా తెలిసిందన్నారు. ఇది అబద్ధమని ఎమ్మెల్యే అంటే దేనికైనా సిద్ధమన్నారు. భూకబ్జాకోరు ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ క్షమించదన్నారు. కార్యక్రమంలో అల్లూరి అశోక్‌రెడ్డి, గిమ్మ సంతోష్, గుడిపెల్లినగేష్, జహీర్‌రంజాని, కలాలశ్రీనివాస్, బండారి సతీష్, లోక ప్రవీణ్‌రెడ్డి, ఎ.షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు

- ప్రజావాణి వేదికలో అర్జిదారుల ఆవేదన



భీంపూర్ ప్రజావాణిలో త్రీఫేజ్ గురించి ప్రస్తావిస్తున్న రైతులు

భీంపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో ఇచ్చిన దరఖాస్తులకు పరిష్కారం అయి ఉంటుందని మండల బహిరంగ విచారణ వేదికకు వస్తే మళ్లీ సమస్య అలాగే ఉంటుందని అర్జిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. భీంపూర్ మండల కేంద్రంలో సోమవారం ప్రజావాణి బహిరంగా విచారణ కార్యక్రమం నిర్వహించారు జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, తహసీల్దార్ నలంద ప్రియ, ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డిలు అర్జీల పరిస్థితి ఎక్కడ వరకు వచ్చిందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిప్పల్ కోటకి చెందిన షేక్ ముస్కన్ అనే బాలిక ఫించన్ అర్జీ ప్రస్తావనకు వచ్చింది. ఈ బాలిక గతంలో అగ్ని ప్రమాదంలో గాయపడగా దివ్యంగురాలిగా సర్టిఫికెట్ ఇచ్చారు. ఈమె తల్లి రుక్సానా కూడా ఒంటరి మహిళే. అయితే వీరి నుంచి తండ్రి విడిగా ఉండటం నానమ్మ రేషన్ కార్డులో బాలిక పేరు రావడంతో సాంకేతికంగా పొరపాటు జరిగినట్లు తెలుస్తోంది. దీనితో మళ్లీ విచారణ చేసి న్యాయం చేస్తామని అధికారులు చెప్పగా ఎన్ని సార్లు విచారణ చేస్తారని బాధితురాలి తల్లి ప్రశ్నించారు. అలాగే త్రీ ఫేజ్ సమాచారం లేదని అంతర్గం రైతులు బక్కి కపిల్, కునర్పు అశోక్, కరంజి (టీ) రైతు రెడ్డి రమేష్ లు ప్రశ్నించారు. తమకు పైనుంచి సమాచారం వచ్చినప్పుడే మీకు చెబుతామని లైన్‌ఇన్‌స్పెక్టర్ వివరణ ఇవ్వగా రైతులు అసహనం వ్యక్తం చేశారు. తనకు పింఛన్ రావటం లేదని అంతర్గంకు చెందిన సవాయి వీణ తెలిపారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఎంపీవో సుమీర్ అహ్మద్, ఎస్ఆర్ అసిస్టెంట్ జంగు, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, కార్యదర్శులు సాయి, నర్సయ్య, అశ్వక్, అభయ్, సాయి నందా, పూజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సివిల్ డ్రెస్సులో పోలీసులు అంటూ వాహన తనిఖీలు నిర్వహించినా, విలువైన ఆభరణాలు, బంగారం అడిగినా, వారు పోలీసులు కాదనే విష యాన్ని గ్రహించి వెంటనే ఫిర్యాదు చేయాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటన బేలలో చోటు చేసుకుందని వివరించారు. వారిని పట్టుకునే విధంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అప్రమత్తంగా ఉంటూ నూతన పద్ధతుల్లో మోసం చేస్తున్న ఘరానా మోసగాళ్ల చర్యలు నుంచి తప్పించుకోవాలని సూచించారు.

కేటీఆర్‌పై ఉట్నూర్ పీఎస్‌లో నమోదైన
ఎఫ్ఐఆర్‌ను కొట్టేసిన హైకోర్టు

ఉట్నూర్, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): మూసి ప్రక్షాళన పేరుతో రేవంత్ ప్రభుత్వం రూ.25వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును హైకోర్టు సోమవారం కొట్టివేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. గతేడాది సెప్టెంబర్‌లో కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ కేటీఆర్‌పై ఉట్నూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాగా.. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పు సోమవారం వెలువరించారని తెలిపారు. ఈ విషయమై ఉట్నూర్ ఎస్సై మనోహర్‌ను వివరణ కోరగా.. కేసును హైకోర్టు కొట్టివేసినట్లు తెలిసిందన్నారు. అయితే ప్రభుత్వ న్యాయవాది నుంచి తమకు ఇంకా ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు.

రిమ్స్‌లో మెరుగైన వైద్యసేవలు

- ఎంపీ గోడం నగేష్



గ్యాస్ట్రాలజీ ఐపీ, ఓపీ సేవలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుచూపుతో ఆదిలాబాద్ జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఇచ్చారని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో గ్యాస్ట్రోలజీ ఐపీ, ఓపీ సేవలను వారు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులలో లేని పరికరాలు రిమ్స్‌లో ఉన్నాయన్నారు. 90 శాతం వైద్యులు ఉన్నారని, మిగిలిన వారిని భర్తీ చేసేలా సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డాక్టర్ అశోక్, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీవో ఖుష్బుగుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో గిరిజన సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు అర్జీలను సమర్పించారు. అటవీ హక్కు చట్టం ద్వారా సంక్రమించిన తమ భూముల సమస్యలు పరిష్కరించాలని కొందరు కోరగా మరికొందరు రుణాలు, ఆర్థిక సహాయం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్‌జాదవ్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల విభాగం నిర్వహించగా 12 మంది ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను జిల్లా ఎస్పీకి సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఫిర్యాదుదారుల సమస్యలను ఓర్పుగా విన్న జిల్లా ఎస్పీ వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో సూచించారు. అదే విధంగా భూతగాదాలు, ఆస్తితగాదాల విషయంలో చట్టప్రకారం న్యాయపరంగా నడుచుకోవాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారం అనంతరం రిపోర్టు దాఖలు చేయాలని సూచించారు.

ఆదిలాబాద్ రూరల్ : సాయుధ పోలీసు సిబ్బందికి క్రమశిక్షణతో పాటు నిజాయితీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలోని సాయుధ ముఖ్యకార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విధులను నిర్లక్ష్యాన్ని వహించకూడదని తెలిపారు. సిబ్బంది కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ సక్రమంగా నిర్వహించాలన్నారు.

అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన అదనపు కలెక్టర్ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.